క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో శుక్రవారం ప్రధాన మంత్రి మాతృత్వ సంయోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 8 గ్రామాల నుంచి వచ్చిన 52 మంది గర్భిణులకు పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత పరీక్షలు చేశారు. హెచ్‌బీ, ఆర్‌బీసీ, యూరిన్, ఆల్బ్యుమిన్, బరువు, ఎత్తు, గర్భసంబంధిత పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సురక్షిత ప్రసవాల కోసం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని అన్నారు. వేసవిలో వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల రక్షణ కమిటీ సభ్యులకు అవగాహన



బేతపూడి(మంగళగిరి): మండలంలోని బేతపూడి ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం గుడ్ షెఫర్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలల రక్షణ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ప్రతినిధి జె.ఇస్రాయిల్ మాట్లాడుతూ.. సంస్థ బాలల రక్షణ, బాలికల విక్రయాలను అడ్డుకునేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ప్రతినిధి బి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. బాలల పార్లమెంట్ నిర్మాణం ఏ విధంగా జరుగుతుంది, సమాజంపట్ల బాలలు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎ.పోతురాజు, ఎం.సరోజినీ, తేరేజమ్మ, ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

మంగళగిరి టౌన్: చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది ఆగష్టులో చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేనేత కార్మికులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారన్నారు. కానీ ఆ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని గుర్తు చేశారు. చేనేత కార్మికుల ఆందోళన ఫలితంగా మార్చి 26వ తేదీన జీవో విడుదల చేశారని.. కానీ విద్యుత్ అధికారులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సమాచారం రాలేదని చెబుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని విద్యుత్ కార్యాలయాలకు ఆర్డర్స్ విడుదల చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి గాబులు, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. మురుగు పేరుకున్న వాటిలో నీటిని పారబోయించి శుభ్రంచేయించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు పక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని.. నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంచుకోకూడదని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ షేక్.అబ్దుల్ రెహమాన్, ఎంపీహెచ్ మేల్ అసిస్టెంట్ బాబురావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ఫిరంగిపురం:మండల పరిధిలోని పలు గ్రామాలకు ఫిరంగిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాధిత రైతులకు పరామర్శ

దుగ్గిరాల: అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంటను కోల్పోయిన రైతులను సీపీఎం కార్మిక మండల నాయకులు జెట్టి బాల రాజు పరామర్శించారు. దుగ్గిరాలలో శుక్రవారం కోమ్ము గోపి, కోమ్ము శ్రీను అక్రమ్, శెట్టి మహేష్ దేవాదయ భూములను సాగు చేస్తున్నారు. గురువారం జరిగిన సంఘనలో పంట కాలి బూడిదయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి సాగు చేసామని.. రెండు రోజుల్లో పంట అమ్ముకుందాం అనుకునే లోపు ఇలా జరిగిందని రైతులు వాపోయారు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. కార్యక్రమంలో వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు.. కరాటేలో పిడుగులు

- కరాటే పోటీల్లో ప్రతిభ చూపుతున్న చిన్నారులు
- కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై పిల్లల్లో పెరుగుతున్న ఆసక్తి
- వేసవిలో ఉచిత శిక్షణ ఇస్తున్న శిక్షకులు



కరాటే సాధన చేస్తున్న చిన్నారులు

మంగళగిరి: ఆరోగ్య రక్షణతో పాటు కరాటేలో రాణించడమే తమ లక్ష్యం అంటున్నారు. అందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రత్యేక వేసవి శిబిరాలలో శిక్షణ పొందుతున్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన ప్రభాకర్ కొన్నేళ్లుగా ఎందరో విద్యార్థులు, చిన్నారులకు కరాటే విద్యను నేర్పిస్తున్నారు. తర్ఫీదు పొందిన చిన్నారులు అనేక మంది కరాటే పోటీలలో రాణించి బ్లాక్ బెల్ట్‌లు సాధించారు. ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని రాణించి పతకాలు సాధించారు.
వారి అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారిలా..

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



చిన్నప్పటి నుంచి కరాటే అంటే ఇష్టం. తల్లిదండ్రులు సైతం ఎంతో ప్రోత్సహించేవారు. అందుకే శిక్షణ తీసుకుంటున్నాను. రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు కరాటే సాధన చేస్తున్నాను. కరాటే సాధనతో సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవచ్చు. పిల్లలు ఎలాంటి సంఘటనలనైనా ఎదర్కోగలరన్న నమ్మకం తల్లిదండ్రులకు కలుగుతుంది.
– డి.జయరామ్, బ్లాక్ బెల్ట్, జాతీయ ప్లేయర్

ఎంతో ఆసక్తిగా శిక్షణ..



విద్యార్థులంతా ఏకాగ్రతతో కరాటేలో సాధన చేస్తున్నాం. కొత్తగా వచ్చిన వారు కూడా ఎంతో ఆసక్తితో శిక్షణ పొందుతున్నారు. తక్కువ సమయంలోనే పోటీల్లో రాణిస్తున్నారు. మంగళగిరిలో ప్రతిభ కలిగిన విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. కరాటే సాధనతో చదువులో కూడా రాణించవచ్చు.
– డి.మోనిష్, బ్లాక్ బెల్ట్, సౌత్ ఇండియన్ ప్లేయర్

ఉల్లాసంగా ఉండగలుగుతున్నాం..



కరాటే శిక్షణ ఉదయాన్నే చేయడంతో ఆరోగ్యం, ఉల్లాసంగా ఉండగలుగుతున్నాం. తెల్లవారుజామునే నిద్ర లేవడం అలవాటుగా మారుతుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రోజూ శిక్షణకు వస్తున్నా. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ఆనందంగా ఉంది.
– కె.మహర్షి సాయి, బ్లాక్ బెల్ట్, సౌత్ ఇండియా ప్లేయర్

చాలా బహుమతులు సాధించా..



నాకు కరాటే అంటే చాలా ఇష్టం. ఆత్మ రక్షణకు ఆయుధంగా ఉపయోగపడుతుంది. కరాటేలో చాలా బహుమతులు సాధించాను. పలు నగరాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. అమ్మాయిలు కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం పెంపొందడంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుంది.
– కె.వినీత, జాతీయ కరాటే ప్లేయర్

కొత్త విషయాలు నేర్చుకుంటున్నా..



కరాటే నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఉదయాన్నే అందరం కలిసి ఒకే చోట శిక్షణ పొందడం చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. పోటీలకు దూర ప్రాంతాలకు వెళుతుంటాం. ఇలా వెళ్లడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటున్నా.
– ఎస్‌కే హసీనా, బ్లాక్ బెల్ట్, ఇంటర్ నేషనల్ ప్లేయర్

బాలికలు రావడం అభినందనీయం..



10 రోజులుగా కరాటేలో విద్యార్థులకు వేసవి సందర్భంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. కరాటే నేర్చుకుంటున్న బాలికలలో మనోధైర్యం పెరుగుతుంది. ఎలాంటి సంఘటనలనైనా ఎదుర్కొంటామనే ధీమా వస్తుంది. కరాటే శిక్షణకు బాలురతో పాటు బాలికలు కూడా సమానంగా రావడం అభినందనీయం. కరాటేలో శిక్షణ పొందడం వల్ల వ్యాయామం, ఆత్మస్థైర్యం పెంపొందుతాయి. – ప్రభాకర్, కరాటే మాస్టర్

భారత సైన్యం విజయం కోసం హోమం



హోమం నిర్వహిస్తున్న నాగభూషణం

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో భారత సైన్యం పాకిస్తాన్‌తో తలపడే యుద్ధంలో విజయం సాధించాలని కోరుతూ గోశాల కన్వీనర్ బీజేపీ నాయకుడు ప్రాతూరి నాగభూషణం, రాధిక దంపతులు యజ్ఞ, హోమాలను నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసి శ్రీమంత వేడుక, గోపారాయణం చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యావాహచన, పంచగవ్య ప్రాసన, గోమాతకి పంచామృతాభిషేకం, శాంతి హోమం, మహా పూర్ణాహుతి పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాది అమ్మయ్య చౌదరి, జి.సాంబశివరావు, వాసం శ్రీనివాసరావు, మునగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎల్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్రహ్మణ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో బీసీఏ, ఎంసీఏ విభాగాలు సంయుక్తంగా శుక్రవారం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బహుళ శాఖ పరిశోధనలపై జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య పి.సురేష్‌వర్మ, గౌరవ అతిథిగా ఎన్ఐటీ వరంగల్ ఆచార్యులు సురేష్‌బాబులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని.. వాటిని అందుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉందని అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. 200లకు పైగా విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు, ప్రాజెక్ట్‌లను ఇందులో ప్రదర్శించడానికి సురేష్‌వర్మ, సురేష్‌బాబులు అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, ఎంసీఏ విభాగాధిపతి కిరణ్, బీసీఏ విభాగాధిపతి భగవాన్, సదస్సు కోఆర్డినేటర్స్ కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు రామకృష్ణ, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత



అధికారికి సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం మంగళగిరి పట్టణ పరిధిలోని పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు నోటీసులు అందజేశారు. 20న నిర్వహించనున్న సమ్మెలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, బాపనపల్లి వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వై.కమలాకర్, బాలాజీ, ఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు కొరపాటి కోటేశ్వరరావు, వైఎస్సార్‌టీయూసీ నాయకులు రత్నాకరం శ్రీనివాసరాజు, దేవిరెడ్డి అమరేశ్వరరావు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని సి.ఐ.టి.యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని వారు ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే కార్మికులకు న్యాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని వారు విమర్శించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పిచ్చయ్య, సుబ్బారావు, హగ్గయ్య, ఇమాంబి, గురవయ్య, సారమ్మ, శివకుమారి, సువర్ణకుమారి, విజయశ్రీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ సర్వీస్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన లారీ డ్రైవర్ మేరుగు కృష్ణ(44) లారీలో ఈనెల 7న గుడివాడ నుంచి గుంటూరు బయలుదేరాడు. తాడేపల్లి సర్వీస్ రోడ్‌లో భోజనం చేసేందుకు లారీ నిలిపి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కృష్ణను అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని తాడేపల్లి పోలీసులు వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆయన మృతి చెందాడు. కృష్ణ కుమారుడు ఫణి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ ప్రతాప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు చేసుకోవాలి

దుగ్గిరాల: మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.14 వేలు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పి.శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల వివరాలు వెరిఫికేషన్ జరుగుతుందని.. సొంత పొలం కలిగిన రైతులు, పొలం ఉన్న గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్దకు 1(బీ), పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. నేలలో లభ్యమయ్యే పోషకాలను బట్టి రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం తగ్గించి డబ్బులు ఆదా చేసుకోవచ్చని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని.. వివరాలకు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

తాడికొండ: ప్రభుత్వం 2025–26 ఏడాదికి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు ఇచ్చేందుకు ధృవీకరణ జరుగుతుందని.. రైతులు తమ పొలం పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తుళ్లూరు మండల వ్యవసాయాధికారిణి ఎ.శ్రీ రంజని తెలిపారు. 1బీ, పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఆయా కేంద్రాలలో ధృవీకరణ చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్నామని.. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా పచ్చిరొట్ట పైర్లు పెంచుకోవడం ఎరువులు, వాడటం చేయాలని ఆమె సూచించారు.

కిశోర బాలికలకు వేసవి శిక్షణ

దుగ్గిరాల: మండలంలోని అన్ని గ్రామాల్లో కిశోర బాలికలకు వేసవి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దుగ్గిరాలలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐ.సి.డి.ఎస్ సూపర్‌వైజర్ ఎన్.భవాని అధ్వర్యంలో 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు శిక్షణ నిర్వహించారు. యుక్త వయస్సు బాలికలకు రుతుక్రమం పరిశుభ్రత, లైంగిక విద్య, పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాల నిర్మూలన, దానితో కలిగే నష్టాలు, ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, అసమానతలు, ఉన్నత విద్య నైపుణ్యం, కెరియర్ మార్గదర్శకత్వం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, వివిధ సమస్యలు ఎదుర్కోవడం, కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, బాల కార్మిక వ్యవస్థ, బాలికల అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, జాహ్నవి, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

మంగళగిరి: పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో బెటాలియన్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని బెటాలియన్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డ్రిల్ సమయంలో అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శని, ఆదివారాల సెలవులను రద్దు చేసి, సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. దీంతో అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని బెటాలియన్‌లో అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

తాడికొండ: తాడికొండలో శుక్రవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. కంతేరు ఎంపీటీసీ వలపర్ల కల్పనను పోలీసులు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడంపై స్పందించిన ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ ఇతర ఎంపీటీసీ సభ్యులు సమావేశం వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సభను నిర్వహించే సమయాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాతూరులో పారిశుద్ధ్య కార్మికులను కలసి మే 20వ తేదీన జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ఈ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరగడానికి కారణమైన కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ తాడేపల్లి మండల అధ్యక్షులు చొక్కా మరియదాసు, ప్రాతూరు గ్రామ పారిశుద్ధ్య కార్మికులు కనపాల ప్రశాంత్, బండ్ల రవికుమార్, ఇసుకపల్లి నాగరాణి, ప్రాతూరు నాగేశ్వరరావు, బండ్ల హనుమంతు, ప్రాతూరు మరియమ్మ, సిద్దెల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐచ్ఛిక ఆహారాలతో అనర్థాలు



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ గిరిధర్

ఫిరంగిపురం: ఐచ్ఛిక ఆహారాలు(జంక్ ఫుడ్) తీసుకోవడంతో ఫ్లోరైడ్ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎన్‌సీడీసీడీ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ గిరిధర్ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం 2, 3 పరిధిలోని హెల్త్‌వెల్ నెస్ సెంటర్లను ఆయన పరిశీలించారు. కొందరు పిల్లలు ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతుండడాన్ని గమనించి వారికి విటమిన్ సీ మాత్రలు నెలకు సరిపడా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ ప్రోగ్రామ్‌లో భాగంగా హెల్త్ సెంటర్లను పరిశీలించినట్లు తెలిపారు. ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా పాలు, గుడ్లు, బొప్పాయి, క్యారెట్ వంటి పదార్థాలు తీసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారణకు ఎంతో దోహదకారిగా పనిచేస్తుందని చెప్పారు. పానీపూరీ, చాట్ వంటి పదార్థాలు తీసుకోకూడదన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ నాయకులు శుక్రవారం ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన కేశనం కోటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో ఫిబ్రవరిలో మృతి చెందాడని.. అతని కుటుంబ సభ్యులకు మంజూరైయిన సభ్యత్వ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షలను వారికి అందజేశామని పలువురు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా హరిబాబు, షేక్ నజీర్, పలగాని నాగబాబు, ఆరాధ్యుల నాగేశ్వరరావు, గడ్డిపాటి గౌతం, పంచుమర్తి కనకరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. లంక భూముల సమస్యలను పలువురు అర్జీదారులు అధికారుల దృష్టికి తీసుకురాగా దీనిపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. జీఐఎస్ పోర్టల్‌లో ఉన్న సాంకేతిక సమస్యలపై అమరావతిలో రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు ఫిర్యాదు చేయగా తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలలో అలసత్వం వహించవద్దని అధికారులను ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరీ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కేఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.భీమారావు జీఆర్‌ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ తహసీల్దార్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సి.ఐ.టి.యు నాయకులు కరపత్రాలను శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈ సమ్మెలో ఆటో, భవన నిర్మాణ, ఆశా, మున్సిపల్, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు దర్శనపు సామేలు, వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరాజు, ఐ.ఎఫ్.టి.యు.కె నాయకులు ఆదినారాయణ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు చెన్నయ్య, అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, టి.వెంకటయ్య, స్టీవెన్, సూరి, అంకయ్య, బాష, నవనీతం, కమల, సాంబయ్య, సుజాత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

దుగ్గిరాల: మండలంలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలు 4 రోజుల పాటు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు రాత్రి 7.35 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజ ఆరోహణము, అగ్ని ప్రతిష్టాపనము మొదలగు కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు నాగేశ్వరం యుగంధర్ పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ ఎం.వి శ్రీనివాస వర్మ ఏర్పాట్లను పరిశీలించారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల పరిశీలన

దుగ్గిరాల: రేవేంద్రపాడులోని శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపీపీ షేక్ జబీన్ పరిశీలించారు. పాఠశాలలో నూతన గదుల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రి లోకేష్‌ను కోరతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధుబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com